క్లుప్తంగా

ప్రత్యేకాధికారికి సన్మానం



ప్రత్యేకాధికారికి శాలువా కప్పిన నాయకుడు

తలకొండపల్లి: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఏడీ సెరికల్చర్ అధికారి ముత్యాలు నియమితులై పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ జిల్లా రైతు అధ్యక్షుడు శక్రునాయక్ గురువారం సాయంత్రం మండల కేంద్రంలో శాలువా, పూలమాలతో ప్రత్యేకాధికారిని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులను పునరుద్ధరించండి

కడ్తాల్: కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి ఆమనగల్లు–మాల్ రూట్లో రాకపోకలు సాగించే నాలుగైదు బస్సులను కరోనా సమయంలో రద్దు చేశారని, తిరిగి వాటిని పునరుద్ధరించాలని పీఆర్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్‌గుప్తా శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కల్వకుర్తి ఆర్టీసీ డీఎంకు పలుమార్లు వినతిపత్రాలు అందించిన స్పందన లేదని పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కలిసి సమస్యను వివరిస్తే పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికి ఆచరణ కాలేదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు సమస్యపై దృష్టి సారించి బస్సులు నడపాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సురక్షితంగా ఎలా బయటపడాలనే అంశంపై తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఫైర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎస్‌ఐ యాదగిరి బృందం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సైరన్ మోగగానే వెంటనే బయటకు రావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

కడ్తాల్: చిన్ననాటి మిత్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, అతని కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన ఢిల్లీ శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో చిన్న నాటి మిత్రులందరూ కలిసి శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.21వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మహేశ్, రాజు, ఓర్సు మహేశ్, మాధారం మహేశ్, గోపాల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

యువతకు ఏదైనా సాధ్యమే



దశరథ్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ యూత్ వింగ్ కార్యకర్తలు

కడ్తాల్: యువకులు తలచుకుంటే ఏదైన సాధించవచ్చని మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. జెడ్పీటీసీగా ఐదు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న ఆయనను బీఆర్‌ఎస్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. యువకులు సమాజ సేవతో పాటు, రాజకీయాల్లో రాణించడం ద్వారా తమ గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గుప్తా, రమేశ్, పంతునాయక్, లాయక్‌అలీ, రమేశ్, మహేశ్, అంజి, పాండు, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సుశీల, అరుణశ్రీ, విద్యావతి, మాలతిలు బదిలీ అయ్యారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఉపాధ్యాయులను అకాడమీ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిగౌడ్, శ్రీనునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో మోస్తరు వర్షం

తలకొండపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల రోజులుగా సరైన వానలు లేక అన్నదాతలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు అరగంట కురిసిన వర్షానికి రోడ్లన్నీ వరదనీటితో నిండిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

లక్షలు వెచ్చించి.. ప్రారంభం మరిచి

- రెండేళ్ల క్రితమే నిర్మాణం పూర్తయిన షాపింగ్ కాంప్లెక్స్
- ప్రస్తుతం నిరుపయోగంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నిర్మాణం పూర్తయి రెండేళ్లు కావొస్తున్నా నేటికి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం నీరుగారుతోంది. ఫలితంగా స్థానిక చిరు వ్యాపారులు, నిరుద్యోగులు ప్రారంభానికి కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.



పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

కడ్తాల్: మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా వదిలేయడంతో ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి రెండేళ్ల దగ్గర పడుతున్న నేటికి ప్రారంభించక పోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. పాలశీతలీకరణ కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు దాని ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్(మార్కెట్ భవన సముదాయం) నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఏళ్లు అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం శూన్యం.

త్వరలోనే ప్రారంభిస్తాం



మండల కేంద్రంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయింది. సంబంధిత ఉన్నతాధికారులు కూడా షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని పరిశీలించారు. టెండర్ ప్రక్రియ, న్యాయ సంబంధిత అభిప్రాయం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. అక్కడి నుంచి ఆదేశాలు రాగానే కాంప్లెక్స్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

– రాధిక, మేనేజర్, పాలశీతలీకరణ కేంద్రం, కడ్తాల్

రూ.48 లక్షలతో నిర్మాణం

పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను 2022 జనవరిలో రూ.48 లక్షలతో అప్పటి రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు వేగంగా సాగడంతో పది గదుల షాపుల నిర్మాణాలు అదే ఏడాది ఆగస్టు చివరి వారంలోనే పూర్తయ్యాయి. అప్పటి నుంచి నేటికి ప్రారంభం కోసం కళ్లు కాయలు కాసేలా చిరువ్యాపారులు, నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

నిరాశలో చిరు వ్యాపారులు

రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి 23 నెలలు కావొస్తున్న ప్రారంభించకపోవడం, వాటికి వేలం నిర్వహించక పోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు అద్దెకు తీసుకుని ఉపాధి పొందుదామని ఆశగా ఎదురు చూస్తున్న యువకులు, నిరుద్యోగులు, చిరువ్యాపారులు భవనాలు ప్రారంభించకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

అద్దెకు దొరకని పరిస్థితి

మండల కేంద్రంలో జనాల తాకిడి పెరిగి అద్దెకు షాపులు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో గత్యంతరం లేక ప్రైవేట్ భవనాలను ఆశ్రయిస్తున్నారు. పట్టణం నడిబొడ్డున పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ప్రభుత్వం వ్యాపార సముదాయం ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని సంకల్పించింది. నిర్మాణం పూర్తి చేసి ఏడాదిన్నర కావడంతో స్థానికులు విసుగు చెందుతున్నారు. ఏడేళ్ల క్రితం శ్రీశైలం–హైదరాబాద్ రోడ్డు విస్తరణలో ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించడంతో ఎంతో మంది ఉపాధి కోల్పోయారు. సుమారు 50 కుటుంబాల వరకు నష్టపోయాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లపై చిన్నడబ్బాలు, కొట్లు ఏర్పాటు చేసుకొని కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించి, వేలం నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగుల పింఛను పెంచండి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి జెర్కొని రాజు



ఆర్డీఓకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌పీఆర్‌డీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని మాట ఇచ్చి అమలు చేయడం లేదని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి జెర్కొని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డికి ఈ మేరకు దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని కోరారు. గడిచిన 13 ఏళ్లలో 300 రెట్లు నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయని గుర్తు చేశారు. పెన్షన్‌లో కేంద్ర ప్రభుత్వ వాటా పెంచకుండా దివ్యాంగుల గురించి మాట్లాడే హక్కు కేంద్రానికి లేదన్నారు. వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పెన్షన్ రూ.4 వేలకు పెంచుతామని హామి ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా పెంచడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నాగార్జున, శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, భిక్షపతి, గడ్డం దశరథ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్



నర్సరీని పరిశీలిస్తున్న రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ప్రభుత్వం చేపట్టే వన మహోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. పట్టణంలోని నర్సరీని శుక్రవారం వైస్‌చైర్మన్ దుర్గయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కలను సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం నిర్వహిస్తుందని చెప్పారు. ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొని తమ ఇంటి ముందు మొక్కలను నాటి సంరక్షించాలని ఆయన కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాలలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు.

నేడు ఉచిత రేబిస్ టీకా

కడ్తాల్: ప్రపంచ జూనోసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పశువైద్య కేంద్రంలో ప్రాణాంతక జూనోటిక్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడమే లక్ష్యంగా కుక్కలకు రేబిస్ టీకా అందజేస్తున్నామని పశువైద్యాధికారి భానునాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ప్రాణాంతక జూనోటిక్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడమే లక్ష్యంగా పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకా అందిస్తామన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాములు
- విద్యార్థి, యువజన నాయకుల అరెస్టులపై ఖండన



ఇబ్రహీంపట్నం రూరల్: పోలీస్‌స్టేషన్ ఎదుట నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులు తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడికి బయలుదేరుతారని ముందుస్తుగా బీఆర్‌ఎస్వీ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ నాయకులను శుక్రవారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నం ఠాణాలో యువజన విభాగం నాయకులు జెర్కొని రాజు, శివసాయి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు తరంగ్, బీజేవైఎం నాయకుడు విజయ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఆదిబట్లలో బీఆర్‌ఎస్వీ నాయకులు తిరుమల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, రాజేష్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి పేర్కొన్నారు. అరెస్టు చేసిన విద్యార్థి, యువజన నాయులను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. అరెస్టులను తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగ సమస్యలను తీర్చకుండా అరెస్టులు చేయడం సిగ్గు చేటన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన

మంచాల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు అంగోత్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులకు అక్రమంగా అరెస్టు చేశారు. అనంతరం మంచాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయడం సహజమే అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో యాదీలాల్ తదితరులు

ఆమనగల్లు: కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం ఆరెకటిక సంఘం రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదీలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కార్యాలయంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలలో ఉన్న విధంగా తెలంగాణలో ఆరె కటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాంకిరణ్ తదితరులు ఉన్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ,ఆదిబట్ల పోలీస్ స్టేషన్లల్లో పని చేస్తున్న పలువురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషీ ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆదిబట్ల ఎస్‌ఐ లింగారెడ్డి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా కె.రాజు ఆదిబట్లకు బదిలీపై వచ్చారు. ఇబ్రహీంపట్నంలో పని చేస్తున్న ఎస్‌కే మైబెల్లి నాచారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మల్కాజ్‌గిరిలో పనిచేస్తున్న జి.లక్ష్మయ్య ఇబ్రహీంపట్నానికి బదిలీ అయ్యారు. ఇబ్రహీంపట్నంలో పనిచేస్తున్న మారయ్య సరూర్‌నగర్ పీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

యాచారం ఎస్‌ఐ..

యాచారం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటనారాయణ స్థానచలనం చెందారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కీసర ఠాణా నుంచి మధుకుమార్ బదిలీపై యాచారం వస్తున్నారు. త్వరలో యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్లలో ఉన్న ఎస్‌ఐలు కూడా బదిలీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

స్థానచలనం సహజం

తలకొండపల్లి: విధి నిర్వహణలో బదిలీలు సహజమని ఎస్‌ఐ శ్రీకాంత్ అన్నారు. ప్రజలతో మమేకమవుతూ నిస్వార్థంగా సేవలు అందజేస్తే సమాజంలో సముచితమైన గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని పోలీస్ స్టేషన్‌లో ఆరేళ్లు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్, బాలస్వామిలు బదిలీలు అయ్యారు. శుక్రవారం బదిలీపై వెళుతున్న వారికి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు.

హామీలను అమలు చేయండి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి

తలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొన్ని హామీలను అమలు చేయలేదన్నారు. మాయమాటలతో సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేజిక్కించుకుందన్నారు. తులం బంగారు, వృద్ధులకు రూ.నాలుగు వేల పింఛన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టులతో కట్టడి

అన్యాయమంటూ బీజేవైఎం, బీజేపీ నాయకుల ఆగ్రహం



తలకొండపల్లి: కలెక్టరేట్ వద్ద ఆందోళనలో నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనకు హాజరు కాకుండా అబ్దుల్లాపూర్‌మెట్ మండల బీజేవైఎం, బీజేపీ నేతలను పోలీసులు శుక్రవారం ముందుస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. గ్రూప్ 2,3 పోస్టుల సంఖ్యను పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని, అదే విధంగా ప్రభుత్వ విడుదల చేసిన డీఎస్సీ పరీక్షల తేదీలను వాయిదా వేసి మెగా డీఎస్సీని ప్రకటించాలన్నారు. నిరసనలో పాల్గొనేందుకు వెళ్తున్న తమని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాపయ్యగౌడ్, విష్ణుగౌడ్, సాయికిరణ్‌గౌడ్, రమాదేవి, శ్రవణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

తలకొండపల్లి: మెగా డీఎస్సీని వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించాలని శుక్రవారం ఆందోళన చేపట్టారు.

అదుపులోకి బీజేవైఎం శ్రేణులు

యాచారం: కలెక్టర్ ముట్టడికి బీజేవైఎం ఇచ్చిన పిలుపు మేరకు ముందస్తుగా పోలీసులు బీజేపీ, బీజేవైఎం శ్రేణులను అరెస్టులు చేశారు. యాచారం , హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా పోలీసులు ఉదయమే బీజేపీ శ్రేణులను అరెస్టులు చేశారు.వారిలో జంగయ్య, శాంతికుమార్, శేఖర్, శివమోదీ, నాగరాజు ఉన్నారు.

పోరాడితే తప్పేముంది

మంచాల: విద్యార్థి సంఘాల కలెక్టరేట్ ముట్టడి చేయకుండా పోలీసులు మంచాలలో బీజేపీ నాయకులకు తెల్లవారుజామున అరెస్టు చేశారు. వారిలో నాయకులు జంగయ్యగౌడ్, నూకంరాజు, రాజుగౌడ్, విజయ్, వినోద్, మహేశ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేస్తామన్నారు. విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై పోరాడితే తప్పేముందని ప్రశ్నించారు.



అబ్దుల్లాపూర్‌మెట్: ఠాణా ఆవరణలో బీజేపీ, బీజేవైఎం నాయకులు



మంచాల: ముందస్తుగా అరెస్టు చేసిన బీజేపీ నాయకులతో పోలీసులు

వర్గీకరణ సాధనకు కృషి

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మహేశ్



నందివనపర్తిలో సమావేశమైన ఎమ్మార్పీఎస్ శ్రేణులు

యాచారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 7న ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని ఆ సంఘం మండల ఇన్‌చార్జి మూలి మహేశ్ అన్నారు. మండలంలోని నందివనపర్తి గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణలు చేయాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణే లక్ష్యంగా కృషి చేద్దామని సూచించారు. అనంతరం గ్రామ శాఖ కార్యవర్గాన్ని నియమించారు. సమావేశంలో నాయకులు జగన్, వెంకటయ్య, వినోద్, సుధాకర్, ఆనంద్, యాదగిరి, ఆనంద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

మంచాల: ఆరేళ్ల తర్వాత బదిలీలు జరుగుతుండడంతో ఉపాధ్యాయులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. సెంకడరీ గ్రేడ్ టీచర్ల బదిలీల విషయంలో పూర్తిస్థాయిలో ఖాళీలు చూపించాలన్నారు. పది మండలాలు జిల్లాలో కలిసిన తరువాత మొదటిసారిగా వారితో కలిపి బదిలీలు నిర్వహిస్తున్నారన్నారు. 2,200 మంది పైగా ఎస్జీటీ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహిస్తుండడంతో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలో జరిగిన పొరపాట్లు ఇక్కడ జరగకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు.

ఏపీ మంత్రికి అభినందనలు



మంత్రి సుభాష్‌తో కౌన్సిలర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: ఏపీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాసంశెట్టి సుభాష్‌ను శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ నాయకులకు కలిశారు. కౌన్సిలర్లు వర్దేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి, గ్యారల శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నేత కాల్వ కొండల్ రెడ్డి, వాసంశెట్టి చినబాబులు మంత్రి సుభాష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.



● ప్రధాన రహదారి.. అపరిశుభ్రంగా మారి

పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై కొన్ని రోజులుగా చెత్త దర్శనమిస్తోంది. సమీపంలోని దుకాణదారులు, బాటసింగారం మార్కెట్‌కు పండ్లు తీసుకువచ్చే వాహనదారులు చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేస్తుండడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయింది. దీంతో అందులోంచి దుర్వాసన వ్యాపించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్మూధూళి గాల్లో ఎగరడంతో చోదకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పురపాలక సంఘం అధికారులు స్పందించి రోడ్డుపక్కనే చెత్త వేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– అబ్దుల్లాపూర్‌మెట్